ప్రజాశక్తి
శుక్రవారం 7 మార్చి 2025
5
పార్వతీపురం మన్యం

మన్యం సహజ రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి
జాతీయ స్థాయి అవార్డు

ప్రజాశక్తి-సీతంపేట

మన్యం సహజ రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి జాతీయ స్థాయి అవార్డు లభించింది. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రతిష్టాత్మకమైన భారత్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఫర్ కలెక్టివ్ ఎంటర్‌ప్రైజెస్ అవార్డుకు ఎంపికైనట్లు ఆయన ప్రకటించారు. ఈ నెల 8న అవార్డును కేరళ రాష్ట్రంలోని త్రిశూర్‌లో అందజేయనున్నట్లు వివరించారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి ఈ అవార్డుకు ఎంపిక కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తంచేశారు. కంపెనీ చైర్మన్ నిమ్మక వరహాలమ్మ , డైరెక్టర్ కర్రేక గౌరమ్మ, సిఇఒ బి.శంకర్ రావు పాల్గొన్నారు.

అసెంబ్లీలో ఎమ్మెల్యే సరికొత్త రాగం

ఆక్రమణకు గురైన లంకెలబందను చూపిస్తున్న ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు

యువ ఎమ్మెల్యే, విద్యావంతుడు బోనెల విజయచంద్ర అసెంబ్లీలో సరికొత్త రాగం అందుకున్నారు. పార్వతీపురం పట్టణంలో ప్రభుత్వ భూములు, చెరువుల కబ్జాలపై విచారణ కమిటీ వేయాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే విజయచంద్ర కోరడం సర్వత్రా చర్చనీయాంశమైంది. గత సార్వత్రిక ఎన్నికల్లో పట్టణంలో భూదందాలపై పదునైన విమర్శలతో చెలరేగిన ఆయన.. అధికారంలోకి వచ్చాక ఈ విషయమై కనీసం నోరు మెదపలేదు. ఇలాంటి తరుణంలో అనూహ్య రీతిలో విచారణ కమిటీ నియమించాలని కోరడంతో 'అవగాహన' రాజకీయాలు చేస్తున్నారనే ప్రచారం ఊపందుకొంది.

- చెరువుల కబ్జాలపై కమిటీ కాలయాపన కోసమేనా?
- 9 నెలలుగా ఆక్రమణలపై నోరు మెదపని బోనెల
- మాజీ ఎమ్మెల్యేతో అవగాహన కుదిరిందనే ప్రచారం

ప్రజాశక్తి-పార్వతీపురం

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచాయి. రెవెన్యూ డివిజన్, నియోజకవర్గ కేంద్రంగా ఉన్న పార్వతీపురం... మన్యం జిల్లా కేంద్రమైన తర్వాత పట్టణంలో ప్రభుత్వ భూములు, చెరువుల కబ్జాలు ఎక్కువయ్యాయి. 2019 నుంచి 2024 వరకు పట్టణ పరిసర ప్రాంతాల్లో అంతులేని ఆక్రమణల పర్వం కొనసాగింది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే అలజంగి జోగారావు అండదండలతోనే కబ్జాలు, ఆక్రమణలు ఎక్కువయ్యాయనేది జగమెరిగిన సత్యం. అప్పటి అధికారపార్టీ నాయకులు, అధికారులు కూడబలుక్కొని చెరువుల కబ్జాలకు శ్రీకారం చుట్టారనేది బహిరంగ రహస్యమే. గత ఎన్నికల ప్రచారంలో టిడిపి కూటమి అభ్యర్థి బోనెల విజయచంద్ర ప్రభుత్వ భూములు, చెరువుల కబ్జాలపై గట్టిగానే గళం విప్పారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కబ్జాదారుల అంతు చూస్తానని పదేపదే గర్జించారు. రాజకీయాల్లోకి మొదటిసారి అరంగేట్రం చేసిన యువకుడు, విద్యావంతులైన విజయచంద్ర మాటలను ప్రజలు నమ్మారు. ఆయన ఎమ్మెల్యే అయిన తర్వాత భూకబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తారని ప్రజలు భావించారు. ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు ఆయనకు పట్టం కట్టారు. మాజీ ఎమ్మెల్యే జోగారావుపై పెల్లుబికిన అవినీతి, అక్రమాల ఆరోపణలను తన గెలుపు కోసం మలుచుకోవడంలో ఆయన విజయం సాధించారు. రాష్ట్రంలోనూ టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడింది.

ఇన్నాళ్లూ మౌనం ఎందుకో?

ఎమ్మెల్యేగా బోనెల విజయచంద్ర ఎన్నికైన ఈ తొమ్మిది నెలల కాలంలో ఒక్కసారి కూడా ప్రభుత్వ భూములు, చెరువుల కబ్జాలపై నోరుమెదిపిన దాఖలాలు లేవు. భూకబ్జాదారుల అంతు చూస్తానని ఆయన పలికిన బీరాలు ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. గత ఎన్నికల సమయంలో అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే జోగారావు భూదందాలపై ఒంటికాలితో లేచిన బోనెల విజయచంద్ర ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే జోగారావు, తాజా ఎమ్మెల్యే విజయచంద్ర మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరిందనే వాదనలు నియోజకవర్గం అంతటా వినిపిస్తున్నాయి. ఆ ఒప్పందం కారణంగానే ఎమ్మెల్యే విజయచంద్ర.. భూకబ్జాలపై ఇన్నాళ్లు మౌనం వహించారనే ప్రచారం జరుగుతోంది. గడిచిన తొమ్మిది నెలల కాలంలో వైసిపికి చెందిన మాజీ ఎమ్మెల్యే జోగారావు, టిడిపికి చెందిన ఎమ్మెల్యే విజయచంద్ర ఒకరిపై మరొకరు రాజకీయ ఆరోపణలు, విమర్శలు చేసుకున్న దాఖలాలు కూడా లేవు. తాజా పరిణామాల నేపథ్యంలోనే మాజీ ఎమ్మెల్యే, తాజా ఎమ్మెల్యే మధ్య అవగాహన కుదిరిందనే ప్రచారం సాగుతోంది.



ఎమ్మెల్యే విజయచంద్ర

నాన్చుడుకేనా?

తొమ్మిది నెలలపాటు మౌనం దాల్చిన ఎమ్మెల్యే విజయచంద్ర.. అనూహ్యంగా ఈ నెల 4న అసెంబ్లీలో సరికొత్త రాగం ఆలపించడం చర్చనీయాంశమవుతోంది. పార్వతీపురం పరిసర ప్రాంతాల్లో జరిగిన భూకబ్జాలు, ఆక్రమణలపై విచారణకు కమిటీ నియమించాలని ఆయన గళమెత్తడం వ్యూహాత్మక ఎత్తుగడలో భాగమేనని తెలుస్తోంది. విశాఖపట్నం లాంటి మహానగరంలో జరిగిన భూదందాలపై రెండు సార్లు రెండు ప్రభుత్వాల హయాంలోనూ సిట్‌తో విచారణ జరిపించారు. ఆ విచారణ కమిటీలు ఏమి తేల్చాయో ఇంతవరకు అతీగతీ లేని పరిస్థితి కనిపిస్తోంది. ఏళ్ల గడుస్తున్నా విశాఖ భూదందాలపై విచారణ కమిటీలు నిజం నిగ్గు తేల్చలేదు. అలాంటి పరిస్థితుల్లో పార్వతీపురం లాంటి పట్టణంలో భూకబ్జాలపై విచారణ కమిటీ వేయాలని ఎమ్మెల్యే విజయచంద్ర కోరడం కాలయాపన కోసమేనని తెలుస్తోంది. తొమ్మిది నెలలుగా భూదందాలపై నోరు మెదపని బోనెల విజయచంద్ర అనూహ్య రీతిలో విచారణ కమిటీ నియమించాలని కోరడం తనపై వస్తున్న ఆరోపణల నుంచి బయటపడడానికేననే గుసగుసలు వినిపిస్తున్నాయి.

సమావేశంలో అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

8 నుంచి పి-4 సర్వే

- తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక శ్రద్ధ
- ఉపాధిహామీ పనులపై దృష్టి సారించాలి
- అధికారులతో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

మార్చి 8 నుంచి జిల్లాలో పి-4 విధానంపై (పబ్లిక్, ప్రయివేట్, పీపుల్ పార్టనర్‌షిప్) సర్వేను పక్కాగా చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి మార్చి ఏడో తేదీన సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చి, 8 నుంచి ప్రారంభించి వారంలోగా సర్వే పూర్తిచేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 2.65 లక్షల గృహాలకు సర్వే చేయాల్సి ఉందని, ప్రణాళికాబద్ధంగా పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పి-4 సర్వే, ఉపాధిహామీ, వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలపై గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి-4 విధానం ద్వారా పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడానికి జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలోని 20 శాతం మంది నిరుపేదలను గుర్తించాల్సి ఉందని తెలిపారు. దీనిపై మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు చొరవ తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో దారిద్ర్యరేఖకు దిగువనున్న వారిని గుర్తించి, ప్రభుత్వం సూచించిన ప్రమాణాల మేరకు సర్వే చేపట్టి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ, ప్రయివేట్, ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ఇళ్ల పేదరికాన్ని అధిగమించి, ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసే ఉద్దేశంతో ఈ విధానాన్ని అమలు చేస్తుందన్నారు. ప్రజలు అందుబాటులో ఉండే సమయంలో ఈ సర్వేను చేపట్టాలని, ఒక్కొక్కరూ కనీసం 90 వరకు సర్వేలు పూర్తిచేయాలని ఆదేశించారు.

వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్య ఉండరాదని, జూన్ నెలాఖరి వరకు నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన ముందస్తు చర్యలను ఇప్పటినుంచే తీసుకోవాలని సూచించారు. ప్రతీ ఎంపిడిఒ వారి పరిధిలోని నీటి కొళాయిలు, బోర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్యలు ఉన్న చోట తక్షణమే పరిష్కరించాలని స్పష్టంచేశారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో అవసరమైతే బోర్లు వేయడం, మరమ్మతులు చేపట్టడం చేయాలన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా బోర్లు మంజూరై ఉంటే వాటిని వేయించుకోవాలని, లేకుంటే జిల్లా పరిషత్తు నుంచి నిధులను పొంది పనులు చేపట్టాలని సూచించారు. కొత్తగా ఏర్పడిన కాలనీలకు కూడా నిరంతర తాగునీటి సరఫరా కావాలని వివరించారు. గ్రామాల్లో ప్రతీ వారం తాగునీటి పరీక్షలు నిర్వహించి, గ్రామ నీటి, పారిశుధ్య కమిటీల రిజిష్టరులో నమోదు చేయాలని తెలిపారు. భవిష్యత్తులో స్వచ్ఛంద సంస్థల సహకారంతో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఉపాధి హామీ కింద రూ.215 కోట్లు జిల్లాకు మంజూరు కాగా, ఇప్పటివరకు రూ.158 కోట్ల మేర పనులు పూర్తిచేశారని కలెక్టర్ తెలిపారు. మరో రూ.28 కోట్ల పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మిగిలిన నిధులకు సరిపడా పనులను ఈ నెల 20వ తేదీలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాలో మినీ గోశాలలు చాలా మంది కోరుతున్నారని, వాటిని దృష్టిలో ఉంచుకొని వీలైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని సూచించారు.

ఈ సమావేశంలో కెఆర్ఆర్‌సి ఎస్‌డిసి పి.ధర్మచంద్రారెడ్డి, జిల్లా పశు సంవర్ధక అధికారి ఎస్.మన్మథరావు, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి.కరుణాకర్, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుపతినాయుడు, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, డిఎల్‌డిఒ రమేష్ రామన్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు లాటరీ

పారదర్శకంగా కేటాయింపు : కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలోని నాలుగు మద్యం దుకాణాలను గీత కులాలకు పారదర్శకంగా లాటరీ పద్ధతిలో కేటాయించినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. గీత కార్మికులు, సొండి కులస్తులకు మద్యం దుకాణాల కేటాయింపు కార్యక్రమం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరై లాటరీ ప్రక్రియను ప్రారంభించారు. తొలుత పార్వతీపురం, సాలూరు, వీరఘట్టం, పాలకొండలోని మద్యం షాపులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సమక్షంలో లాటరీ తీసి, దుకాణాలను కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-2026 సంవత్సరానికి గాను 4 మద్యం దుకాణాలను గీత కులాలకు పారదర్శకంగా కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలోని 4 దుకాణాలకు 60 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో పార్వతీపురం-17, సాలూరు- 8, వీరఘట్టం- 22, పాలకొండ-13 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరింటెంటెంట్ ఎ.శ్రీరంగం, సిఐలు బి.నర్సింగరావు, జి. దాసు, కె.సూర్యకుమారి, వి.వి.ఎస్.శేఖర్‌బాబు, పి.శ్రీనివాసరావు, పి.మురళీధర్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లాటరీ తీస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

సాగునీరు అందించాలి

మంత్రికి ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

తోటపల్లి అదనపు ఆయకట్టుకు గత ప్రభుత్వం 2019లో ఇచ్చిన జిఒ 164ను అమలుచేసి గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల్లో 8 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి.. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు గురువారం వినతి అందించారు. జంఝావతి ఆయకట్టును స్థిరీకరించి తోటపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా నీరు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అక్కేన మధుసూదనరావు, ఎం.పురుషోత్తమ నాయుడు, అంబటి రాంబాబు, ఎ.రామకృష్ణ ఉన్నారు.

మంత్రికి వినతినిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, నాయకులు

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

కలెక్టర్‌కు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వినతి

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి టిడిపి కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. గురువారం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు ఆ ఫెడరేషన్ నాయకులు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఆప్కాస్‌ను రద్దు చేస్తున్నప్పుడు, అంతకన్నా మెరుగైన జీవన విధానాన్ని కార్మికులకు అందించాలని కోరారు. టిడిపి కూటమి ప్రభుత్వం అలా చేయకుండా కాంట్రాక్టర్ల చెప్పు చేతల్లోకి కార్మికులను నెట్టాలని చూస్తే మరో పోరాటానికి వెనుకాడబోమని హెచ్చరించారు. జిఒ 279ను తీసుకువచ్చి కార్మికులను కట్టుబానిసలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం గతంలో చూస్తే దానిపై పోరాడామని గుర్తు చేశారు. జిల్లా పరిధిలో సాలూరులో నేటికి డబ్బులు లేవనే కారణంతో రెగ్యులర్‌గా జీతాలు చెల్లించడం లేదని, ఫిబ్రవరి నెల జీతం కార్మికుల ఖాతాలకు వేయలేదని తెలిపారు. సబ్బులు, నూనెలు, చెప్పులు ఇవ్వడం లేదన్నారు. మరణించిన కార్మికుల ఉద్యోగాలకు సంబంధించి కౌన్సిల్ తీర్మానించి రెండేళ్లు గడుస్తున్నా వారి కుటుంబాలకు పోస్టులు వేయలేదని చెప్పారు. సాలూరు పట్టణంలో శ్యామలంబ పండగ దృష్ట్యా కార్మికులకు సెలవులు ఇవ్వాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, జిఒ నెంబర్ 36 అమలు చేసి, ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, డ్రైవర్ల వేతనాలు జిఒ ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా నాయకులు మల్లేష్, సింహాచలం, రాముడు, శంకర్, ఇందు, నిర్మల, రవి, సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, నాయకులు సూరిబాబు పాల్గొన్నారు..

కలెక్టర్‌కు వినతి అందిస్తున్న ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, సిఐటియు నాయకులు

మహిళా దినోత్సవ వేడుకలను
విజయవంతం చేయాలి

డిఆర్ఒ కె.హేమలత

ప్రజాశక్తి-పార్వతీపురం

ఈ నెల 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత తెలిపారు. గురువారం ఆమె ఛాంబరులో మహిళా దినోత్సవ వేడుకల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను సజావుగా, సమన్వయంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, డిఆర్‌డిఎ, మెప్మా, చేనేత, ఐటిడిఎ, వ్యవసాయ శాఖ, మైనారిటీ సంక్షేమ శాఖలు స్టాల్స్ ఏర్పాటుచేస్తాయని, వాటికి డిఆర్‌డిఎ పీడీ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తారని తెలిపారు. సంక్షేమ పథకాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఇన్‌ఛార్జిగా ఉంటారని చెప్పారు. వేదిక ఏర్పాట్లను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పర్యవేక్షిస్తారని తెలిపారు. డిజిటల్ సెరీన్, డిజిటల్ స్క్రీన్ ఛార్జ్, ఆహ్వాన కార్డుల పంపిణీ బాధ్యతను ఐసిడిఎస్‌కు కేటాయించినట్లు వెల్లడించారు. ఇతర కార్యక్రమాల బాధ్యతను పలు శాఖల అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి టి.కనకదుర్గ, డిఆర్‌డిఎ పీడీ సుధారాణి, డిఇఒ ఎస్.తిరుపతినాయుడు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి.కరుణాకర్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఒ కె.హేమలత

మహిళల రక్షణకు ప్రాధాన్యత

ఎస్‌పి మాధవరెడ్డి ● ఆకట్టుకున్న పోలీస్ హౌస్

పోలీస్‌డాగ్ విన్యాసం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మహిళల రక్షణకు పోలీసు శాఖ ప్రాధాన్యత ఇస్తోందని ఎస్‌పి మాధవరెడ్డి తెలిపారు. అందులో భాగంగానే మహిళా సాధికారత వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళా సాధికారత వారోత్సవాలలో భాగంగా గురువారం పార్వతీపురం జిల్లా పోలీస్ మల్టీ ఫంక్షన్ హాల్ ఆవరణలో ఏర్పాటుచేసిన ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఎస్‌పి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించుటకు పాఠశాల, కళాశాల విద్యార్థులు, మహిళలు, అంగన్వాడీలు, మహిళా పోలీస్ సిబ్బంది పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు ఓపెన్ హౌస్‌లో మహిళలు, విద్యార్థులతో మమేకమై, ఆప్యాయంగా మాట్లాడారు. అనంతరం ఎస్‌పి.. పోలీసుశాఖ విధి నిర్వహణలో ఉపయోగించే వివిధ ఆయుధాలు, అత్యాధునిక పరికరాలు పట్ల అవగాహన కల్పించి, వారిలో స్ఫూర్తి నింపారు. పోలీసుశాఖ ఉపయోగించే సాంకేతికత, క్లూస్ టీం, కమ్యూనికేషన్, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ వివిధ ఆయుధాలను చూపించి వాటి గురించి వివరించారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన డాగ్ స్క్వాడ్ ప్రదర్శన ఆకట్టుకుంది. విన్యాసాల్లో పోలీసు డాగ్స్ చూపిన క్రమశిక్షణ, హ్యాండలర్స్ ఆదేశాలు పాటించే తీరు, ట్రాకర్ డాగ్ శాండీ విన్యాసాలు చూపరులకు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి అంకిత సురాన, ఎఆర్ డిఎస్‌పి థామస్ రెడ్డి, ఎఆర్ ఆర్ఐలు రాంబాబు, నాయుడు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలో నీలకంఠపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ నీలకంఠరావు ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి రాంబాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్షణాలు అలవర్చుకొని, సక్రమంగా చదువుకోవాలని చెప్పారు. అలాంటప్పుడే ఉన్నత స్థానాల్లో స్థిరపడి కుటుంబానికి భరోసాగా ఉండగలరని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొమరాడ : కొమరాడ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కె.నీలకంఠం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఉన్న ఆయుధాలు, సెల్, వాకీటాకీలు తదితర వస్తువుల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తుపాకీ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

కొమరాడ.. వాకీటాకీలో మాట్లాడుతున్న విద్యార్థిని

సంతలో రామ ఫలాలు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట సంతలో గురువారం రామఫలాలు దర్శనమిచ్చాయి. ఏడాదికి ఒకే పంట కావడంతో వాటిని కొనేందుకు మైదాన ప్రాంత ప్రజలు ఎగబడుతున్నారు. సీతంపేట ఏజెన్సీలో సుమారు 500 ఎకరాల వరకు రామఫలాలు పంట కాస్తుంది. రామఫలాలను మధుర ఫలాలని పిలుస్తారు. ఎటువంటి రసాయనాలూ లేకుండా ప్రకృతి సహజ సిద్ధంగా పండుతాయి. అందుకే వీటిలో పోషకాలు పుష్కలంగా ఉంటాయని, ఇవి తింటే ఆరోగ్యానికి మేలని వైద్యులు కూడా చెబుతుంటారు. శ్రీకాకుళం, విజయనగరం, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, భువనేశ్వర్, తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి, సంతల్లో రామఫలాలు ఒకటి రూ.5 చొప్పున, లేదా బుట్ట రూ.500కు కొనుగోలు చేస్తున్నారు. ఒక పండు మైదాన ప్రాంతంలో రూ.15 నుంచి 20 వరకు విక్రయించి దళారులు లాభాలు ఆర్జిస్తున్నారు.

సంతలో విక్రయానికి ఉంచిన రామఫలాలు

వెల్‌నెస్ సెంటర్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

ఎన్‌సిడిసిడి సర్వే పరిశీలన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని జోగంపేటలో గురువారం వైద్య సిబ్బంది చేపడుతున్న ఎన్‌సిడిసిడి సర్వేను డిఎంహెచ్ఒ భాస్కరరావు పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. కేన్సర్ వ్యాధి సర్వే కూడా చేయాలన్నారు వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించి రికార్డులు, మందులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.పావని, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి కనిపించడం లేదా? : టిడిపి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

9 నెలల కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు వైసిపి నాయకులకు కనిపించడం లేదా? అని తెలుగు మహిళా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బిడ్డిక పద్మావతి ప్రశ్నించారు. గురువారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి లేదంటూ మాజీ డిప్యూటీ సిఎం పుష్ప శ్రీవాణి చేసిన వ్యాఖ్యలకు ఆమె కౌంటర్ ఇచ్చారు. 9 నెలల కాలంలో ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు రోడ్లు, పశువులకు గోశాలలు, ఒకటో తేదీకి పింఛన్లు, ఉచిత గ్యాస్ పంపిణీ, పాఠశాలలకు ప్రహరీ గోడ నిర్మాణాలు జరుగుతున్నాయని, ఇవి అభివృద్ధి పనులు కావా? అంటూ ప్రశ్నించారు. మే నెల నుంచి తల్లికి వందనం పథకం అమలవుతందని చెప్పారు. వైసిపి ఐదేళ్ల కాలంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తే, కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల కాలంలోనే ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి నాయకుల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ మంజువాణి, నాయకులు బిడ్డిక కొండలరావు, బిడ్డిక సురేష్ పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని, ఆ ఆస్తుల పరిరక్షణకు కమిటీ ఏర్పాటు చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఇ.వి.నాయుడు, జిల్లా గౌరవాధ్యక్షులు ఆర్‌విఎస్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో వారు విలేకరులతో మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సంపదను దోచుకుంటున్న వారిని అరెస్టు చేసి, ఆ సొమ్ము రికవరీ చేయాలన్నారు. పదేళ్లుగా అసోసియేషన్ నిరవధిక పోరాటాలు చేస్తున్నా ఫలితం లేదన్నారు. అగ్రిగోల్డ్ యాజమాన్యంతో ప్రభుత్వాలు కుమ్మక్కయ్యాయని వారు ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి అగ్రిగోల్డ్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రహదారిని పరిశీలిస్తున్న ఎంపిపి వెంకటరమణ నాయుడు

త్వరలో రహదారి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-వీరఘట్టం

ఎంపిడిఒ కార్యాలయ రహదారి పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు తెలిపారు. గురువారం ఆ రహదారిని పరిశీలించారు. మండల పరిషత్ నిధులు రూ.పది లక్షలతో సిసి రోడ్డు, కాలువ నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ఇంజనీరింగ్ అధికారి డి.కళ్యాణదుర్గ, సీనియర్ సహాయకులు వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలపై అసెంబ్లీలో చర్చించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

పాడేరు, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల పరిధిలోని గిరిజన విద్యాసంస్థల్లో గిరిజన విద్యార్థుల మరణాలపై అసెంబ్లీలో చర్చించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గిరిజన విద్యార్థుల మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖా మంత్రి మొదటి సంతకం అమలు ఎఎన్ఎంల నియామకాలపై గిరిజన ఎమ్మెల్యేలు మాట్లాడాలని చెప్పారు. మంత్రి మొదటి సంతకం అమలుకు ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా ఆమోదం తెలపాలని కోరారు.

8న లోక్ అదాలత్

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక కోర్టులో ఈనెల 8న జాతీయ లోక్ అదాలత్ రెండు బెంచ్‌లలో నిర్వ హించనున్నట్లు మండల లీగల్ సెల్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ చెప్పారు. తనతో పాటు న్యాయవాది కె.శైలజ ఒక బెంచ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహి ణిరావు, న్యాయవాది పి.జగన్నాధం మరో బెంచ్ నిర్వహించి కేసులను పరిష్కరిస్తారని చెప్పారు.
రాజాం: ఈ నెల 8న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని రాజాం సీనియర్ సివిల్ జడ్జి కె. శార దాంబ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం

అధికారులకు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశం

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంజూరైన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్.. ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పిఎం జన్‌మన్, పల్లె పండుగ పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల పురోగతిపై ఆయా ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమంలో కొత్తగా మంజూరైన పనులను వెంటనే ప్రారంభించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. 56 పనులకు సమగ్ర అంచనాలు సిద్ధంచేసి నివేదిక అందజేయాలని స్పష్టం చేశారు. అప్పజెప్పిన పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. పనులలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు.

సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్ర రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డి.చంద్రశేఖర్, సీతంపేట గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారి రమాదేవి, పాలకొండ ఇంజినీరింగ్ అధికారి జి.రవి, పంచాయతీరాజ్ సాంకేతిక సలహాదారు ఎం.వి.ఆర్.కృష్ణాజీ, డిఇలు పాల్గొన్నారు.

జీడి పప్పు పరిశ్రమ స్థాపనకు పరిశీలన

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులోని మార్కెట్ గోదాంలో జీడి పరిశ్రమ స్థాపించేందుకు ఉన్న అనుకూలత, అవకాశాలను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ గురువారం పరిశీలించారు. అధికారులతో కలసి జీడి పరిశ్రమ స్థాపనకు సాధ్యాసాధ్యాలను నిశితంగా పరిశీలించారు. బాయిలర్ ఏర్పాటు, ముడి సరుకు నిల్వ, యంత్రాల ఏర్పాటు, అవసరమైన వసతులు కల్పనకు జీడి పరిశ్రమ వ్యాపారులతో మాట్లాడారు. వాహనాల రవాణా సౌకర్యం, నీటి వసతి సదుపాయాలను అడిగితెలుసుకున్నారు. పరిశ్రమ స్థాపనతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, పరిశ్రమలకు ప్రోత్సాహం లభిస్తుందని వెల్లడించారు. వినూత్న ఆలోచనలతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పేందుకు ముందుకు వచ్చిన ఔత్సాహికులను అనుమతులను త్వరితగతిన మంజూరు చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ, ఎపిఒ మురళీధర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు సుధారాణి, జిల్లా ఉద్యానవన అధికారి బి.శ్యామల, జిసిసి డిఎం మహేంద్ర కుమార్, జిల్లా అగ్రి ట్రేడ్, మార్కెటింగ్ అధికారి ఎల్. అశోక్, సైంటిస్ట్ కెవికె రాజు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయి కృష్ణ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, అధికారులు

సెల్ టవర్లను వినియోగించుకోవాలి

పార్వతీపురం : జిల్లాలో బిఎస్ఎన్ఎల్, జియో ఏర్పాటుచేయబోయే సెల్ టవర్లను వినియోగించుకోవాలని, ఇందుకు అవసరమైన ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో జియో, బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల ఏర్పాటుపై ఎంపిడిఒలు, సంబంధిత అధికారులతో కలెక్టర్ గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే సెల్ టవర్ మంజూరైనప్పటికీ, వేయడానికి వీలుకాని పక్షంలో దానికి బదులుగా వేరే ప్రాంతాన్ని గుర్తించాలన్నారు. సిగ్నల్ వ్యవస్థ లేని టవర్లను కూడా వేరే ప్రాంతానికి మార్చుకునేందుకు వీలుందని తెలిపారు. కొత్తగా సెల్‌టవర్లు అవసరమైన ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదించాలని కోరారు. ప్రతిపాదన చేసే ప్రాంతాలకు టవరును సంబంధించిన మెటీరియల్ తీసుకువెళ్లేలా రహదారి సౌకర్యం ఉండాలని చెప్పారు. రహదారి సౌకర్యం లేకపోతే ఉపాధిహామీ కింద వాటిని మంజూరు చేస్తామని చెప్పారు. అటవీ ప్రాంతంలో అనుమతులను మంజూరు చేయాల్సి వస్తే ప్రభుత్వంతో మాట్లాడతామని తెలిపారు. ప్రస్తుతం అన్ని పనులు ఇంటర్ నెట్, ఫోన్‌తో ముడిపడి ఉన్నాయని, ఇటువంటి తరుణంలో సెల్‌టవర్లను తప్పకుండా ఉపయోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత, జిల్లా నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకులు కె.రామచంద్రరావు, జిల్లా అటవీ శాఖాధికారి జి.ఎ.పి.ప్రసూన, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖల అధికారులు, సాలూరు, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం ఎంపిడిఒలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు, కురుపాంలో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్న మెప్మా, ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్వాడీలు, మహిళలు

మహిళా చట్టాలపై అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి - కురుపాం

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా కురుపాంలో గురువారం ఐసిడిఎస్ పిఒ కె.విజయగౌరి ఆధ్వర్యాన అంగన్వాడీలు, సచివాలయ, పాఠశాల మహిళా సిబ్బంది ర్యాలీ చేపట్టారు. మహిళా దినోత్సవ ప్రాధాన్యతను పిఒ వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు భవాని, జానకి, గౌరి, డిసిపిఒ ఎ.సత్యనారాయణ, జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్, సిబ్బంది శ్రావణి, భాగ్యలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భామిని : మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఐసిడిఎస్ పిఒ శాంతి భవాని కోరారు. భామినిలో అంగన్వాడీ సిబ్బంది గురువారం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. మహిళల హక్కులు, సమానత్వం, భద్రత, మహిళల రక్షణపై అవగాహన కలిగించారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయ ఆవరణలో మహిళలకు ముగ్గులు, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు జ్యోతిలక్ష్మి, వరలక్ష్మి, సబిత, పిరమల్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ రమణయ్య, ప్రోగ్రాం లీడర్ గంగోలి పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మహిళల హక్కులు, సాధికారత, సమానత్వం సాధించినప్పుడే సమాజము దేశం అభివృద్ధి చెందుతుందని నీడ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి పి.వేణుగోపాలరావు తెలిపారు. గురువారం సాలూరులో మెప్మా అధికారులతో కలిపి ర్యాలీ నిర్వహించారు.

వలసలను నివారించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

వ్యవసాయ కార్మికుల వలసలను జిల్లా అధికారులు చొరవ తీసుకుని నివారించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తోట జీవన్న డిమాండ్ చేశారు, గురువారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో పనుల్లేక పెద్ద ఎత్తున కూలీలు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వలసలతో గ్రామాలు ఖాళీ అవుతున్నా జిల్లా అధికారులు స్పందించడం లేదన్నారు. ఉపాధి హామీ పనులు సరిగా కల్పించడం లేదని, చేసిన పనులకు ఐదారు వారాలపాటు బిల్లులు ఇవ్వడం లేదని చెప్పారు. దీంతో వ్యవసాయ కార్మికులు కుటుంబాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి బకాయి బిల్లులు చెల్లించాలని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు గరుగుబిల్లి సూరయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బొత్స మోహన పాల్గొన్నారు.

మాత, శిశు మరణాల నివారణే లక్ష్యం

పిల్లవ బరువు చూస్తున్న డిపిఒ జగన్‌మోహనరావు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మాత, శిశు మరణాల నివారణే లక్ష్యమని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు తెలిపారు. జిల్లా ఆస్పత్రిలోని పోషకాహార పునరావాస కేంద్రం, పిహెచ్‌సి స్టాఫ్ నర్సుల శిక్షణలను గురువారం వైద్య బృందంతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఎన్‌ఆర్‌సిలో చేరిన పిల్లల బరువు ఎదుగుదల వివరాలు పరిశీలించి, అక్కడ చేరినప్పటి నుండి ఏమేరకు పురోగతి ఉందో గమనించారు. తూనిక పరికరం ద్వారా పిల్లల బరువు తనిఖీ చేశారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి ఏయే ప్రాంతాల నుండి వచ్చారు, వారి గ్రామాల్లో పిల్లలకు అందుతున్న వైద్య, అంగన్వాడీ సేవలపై అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ఆహారం తినిపించే ముందు చేతులు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, ఐరన్, విటమిన్ సిరప్‌లను పరిశీలించారు. అనంతరం పిహెచ్‌సి స్టాఫ్ నర్సులకు సాధారణ ప్రసవాలపై గైనకాలజీ విభాగంలో నిర్వహించిన రీఓరియంటేషన్ శిక్షణను పర్యవేక్షించారు. మాత, శిశు మరణాలు నివారించడం, పిహెచ్‌సి ప్రసవాలు మెరుగు పర్చడం శిక్షణ ఉద్దేశమని చెప్పారు. పర్యవేక్షణలో డిపిహెచ్ఎన్ఒ కె.ఉషారాణి, డెమో సన్యాసిరావు, ఇఒ సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడలను ప్రారంభిస్తున్న డిఎస్‌పి రాంబాబు

సోదరభావం పెంచేందుకే క్రీడలు

డిఎస్‌పి రాంబాబు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

యువతలో సోదర భావం పెంపొందించడానికి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు తెలిపారు. ఎల్విన్‌పేట సర్కిల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం పోలీసు శాఖ నిర్వహించిన వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా క్రీడలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. క్రీడల్లో గెలుపు, ఓటమి సహజమన్నారు. ప్రజల కోసం పోలీసు వ్యవస్థ పని చేస్తుందని తెలిపారు. యువతకు ఎటువంటి కోచింగ్ కావాలన్నా, పోటీ పరీక్షలకు అవసరమయ్యే మెటీరియల్ పుస్తకాలను అందిస్తామన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు.

గుమ్మలక్ష్మీపురం, కురుపాం, భామిని తదితర మండలాల నుంచి 34 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో సిఐ హరి, ఎల్విన్‌పేట, కురుపాం, నీలకంఠపురం ఎస్ఐలు బిడ్డిక శివప్రసాద్, నారాయణ రావు, నీలకంఠారావు, పోలీస్ సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫార్మ్ పాండ్ లక్ష్యాలు చేరుకోవాలి

ప్రజాశక్తి-కొమరాడ

లక్ష్యాల మేరకు ఫార్మ్ పాండ్ పనులు పూర్తి చేయాలని డ్వామా పీడీ రామచంద్రరావు ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని పెదశాఖ పంచాయతీ పెదపెదుము, పూసనంది గ్రామాల్లో చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న పనుల వివరాలను ఎపిఒ బాలకృష్ణను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 240 పనులు మంజూరైతే, ఇప్పటికే 120 పనులు పూర్తి చేసినట్లు ఎపిఒ తెలిపారు. మిగిలినవి వచ్చే రెండు వారాల్లో పూర్తి చేయాలని పీడీ ఆదేశించారు. మరో 650 ఫార్మ్‌పాండ్ పనులు మండలానికి లక్ష్యంగా ఇచ్చి, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఉపాధి పని ప్రాంతాల్లో కూలీలకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కూలీల నుంచి మామూళ్లు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫార్మ్ పాండ్ పనులను పరిశీలిస్తున్న పీడీ రామచంద్రరావు

చలో పిఠాపురం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

చలో పిఠాపురం వాల్‌పోస్టర్‌ను జనసేన అరకు పార్లమెంటరీ ఇన్‌ఛార్జి గంగులయ్య, నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు ఆదాడ మోహనరావు, మల్లేష్, నిబ్రం ఆవిష్కరించారు. గురువారం పట్టణంలోని బైపాస్‌రోడ్డులోని ప్రయివేటు ఫంక్షన్ హాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగులయ్య మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి.. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, ఆర్థిక నేరస్తుడికి ఆ హక్కు లేదని వ్యాఖ్యానించారు. పిఠాపురంలో ఈ నెల 14న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పిన్నింటి జయకృష్ణ, రెడ్డి కరుణ, తదితరులు పాల్గొన్నారు.

దశమంతపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని దశమంతపురంలో గురువారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమేహ, రక్తపోటు, జ్వర పీడితులు, గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గౌరీపురంలో..

గుమ్మలక్ష్మీపురం : జియమ్మవలస మండలం కుదమ పంచాయతీ గౌరీపురంలో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి సహకారంతో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యులు సమీర్ చంద్ర, రామ శంకర శ్రీ వల్లభ, సౌమ్య సుమారు వందమందికి వైద్య పరీక్షలు చేశారు. మందులను పంపిణీ చేశారు. వీరిలో నేత్ర చికిత్స, జనరల్ సర్జరీ, గ్యాస్ట్రో, మొదలైన శస్త్రచికిత్స కేసులను గుర్తించి రిఫరల్ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పి.రాజేశ్వరరావు, కె.రమేష్, వి. సాయి సురేష్, ఎ.రాజు, తదితరులు పాల్గొన్నారు.

నీటిట్యాంకు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

సంఘంవలస పంచాయతీ పరిధిలోని సీతంపేట గ్రామంలో తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు పి.రాము అధికారులను కోరారు. గురువారం ఆ గ్రామాన్ని సందర్శించిన ఆయన.. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో బోరు తవ్వినా ట్యాంకు లేకపోవడంతో నీరంతా వృథాగా పోతోందన్నారు. ట్యాంకు ఏర్పాటుచేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు వినతులు అందించినా ఉపయోగం లేదన్నారు. నిరంతరం బోరు నీటిని వినియోగించడం వల్ల తరచూ మోటారు మరమ్మతులకు గురవుతోందని చెప్పారు. తక్షణమే అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని కోరారు.

బోరును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు రాము

లివిరి సర్పంచ్‌కు పతీ వియోగం

ప్రజాశక్తి -భామిని

మండలంలోని లివిరి సర్పంచ్ బౌరి సౌదామిని భర్త బౌరి త్రినాథ్ (50) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. బౌరి త్రినాథ్ వైసిపిలో క్రియాశీలకంగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేశారని పలువురు గుర్తుచేశారు. ఆయన మృతికి వైసిపి నాయకులు సంతాపం తెలిపారు.

నేడు సిర్లి పోతన్న ఎల్లమ్మ జాతర

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలోని సాయినగర్ కాలనీలో సిర్లి పోతన్న ఎల్లమ్మ జాతర శుక్రవారం జరగనుంది. ప్రముఖ యజ్ఞకర్త సర్వ జోషుల వెంకటలక్ష్మి శర్మయాజి ఆధ్వర్యంలో ఈ జాతర నిర్వహించనున్నారు. శ్రీకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యాన ఇప్పటికే జాతర ఏర్పాట్లు పూర్తిచేశారు.

నేరాలు ఘోరాలు

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలోని జెమ్మిడివలస పంచాయతీకి చెందిన కర్రి ప్రసాదరావు (39) రైలు నుంచి జారిపడి గురువారం మృతిచెందాడు. సొంత పనుల నిమిత్తం రెండు రోజుల క్రితం ఆయన రాజమండ్రి వెళ్లి, రైల్లో గురువారం తిరిగి వస్తున్నాడు. అనకాపల్లి స్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు రైలు నుండి జారిపడి మరణించాడు. ప్రసాదరావుకు భార్య, కుమారుడు ఉన్నారు. కొద్దిరోజుల క్రితం మిలటరీలో పనిచేసి, విజయనగరంలో స్థిర పడదామని ప్రయత్నాల్లో ఉన్న కుమారుడు ఆకస్మికంగా రైలుప్రమాదంలో మృతి చెందడం పట్ల తల్లిదండ్రులు సింహాచలం, లక్ష్మి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని కృష్ణపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిపై గురువారం రూరల్ ఎస్ఐ సంతోషి కుమారి బృందం దాడి చేసింది. ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రూ.18,300 నగదు స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.